'లా'పై కంటితుడుపు చర్యలొద్దు : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : ఎస్‌కె యూనివర్శిటీలో న్యాయశాస్త్ర విభాగానికి సంబంధించి కంటితుడుపు చర్యలు కాకుండా అడ్మిషన్‌లతోపాటు, అధ్యాపక పోస్టులనూ భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్‌కెయులో న్యాయశాస్త్ర అడ్మిషన్లను నిలిపేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించు కుంటున్నట్లు విసి ప్రకటించడం కంటితుడుపు చర్యే అన్నారు. తగినంత మంది అధ్యాపకులు లేనందున అడ్మిషన్లు నిలిపివేస్తున్నామని చెప్పిన యాజమాన్యం అధ్యాపకుల భర్తీకి ఏం చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను తెలియజేయాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లో వ్యతిరేకతను తగ్గించుకునేందుకు 'లా' అడ్మిషన్‌లకు అంగీకరించినట్లు ఉందన్నారు. యూనివర్శిటీలో జరుగుతున్న పరిణామాలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. యూనివర్శిటీలో చాలా డిపార్ట్‌మెంట్లలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బోధన, భోధనేతర పోస్టులు భర్తీ చేయకుండా యూనివర్శిటీని కాపాడుకోలేమన్నారు. యూనివర్శిటీలో ఖాళీ పోస్టుల భర్తీ కోసం విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామన్నారు.

మహాసభలో ప్రసంగిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

విద్యారంగ సమస్యలపై ఐక్య పోరాటాలు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్
అనంతలో విజయవంతంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, మాజీ రాష్ట్ర నాయకులు ఎస్.నాగేంద్రకుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 30వ జిల్లా మహాసభలు గురువారం నాడు అనంతపురంలోని వికె.ఆదినారాయణరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించారు. సూరి, నరేష్ ప్రాంగణంలో నిర్వహించిన మహాసభల్లో తొలుత ఎస్‌ఎఫ్‌ఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్రయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా ప్రయివేటీకరణ, కాషాయీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. దీని వల్ల విద్యా వ్యవస్థ నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఆదేశించిందే తడువుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఆ విధానాలను అమలు చేస్తుండడం విచాకరం అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులు డ్రాప్‌అవుట్స్ పెరుగుతున్నాయని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. యూనివర్సిటీల్లో వందలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని ఇప్పటి దాకా భర్తీ చేయలేదన్నారు. అనేక యూనివర్సిటీలో కోర్సులు మూసివేస్తామంటూ విద్యార్థులను ఆందోళనలోకి నెట్టివేయడం సరికాదన్నారు. ప్రభుత్వ విద్య ఉండటంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు వందలాది మంది చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. విద్యార్థుల పక్షాన ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర నాయకులు నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు జరగాలని, సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి కేంద్రం నిధులు మంజూరు చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాల్లో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

ఓతూరు పరమేష్

బంగి శివ

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బంగి శివ, ప్రధాన కార్యదర్శిగా ఓతురు పరమేష్, ఉపాధ్యక్షులుగా సూర్యచంద్ర యాదవ్, వంశీ, వైటి.రమేష్, వరుణ్, అశోక్, దానిష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

300 చీనీ చెట్లు నరికివేత

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దవడుగూరు మండల పరిధిలోని మొలకతాళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలో చెట్ల నరికివేత ఘటన కలకలం రేపింది. దాదాపు 300 చీనీచెట్లును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్ల పెద్దవర్ధిరాజుకు మొలకతాళ్ల గ్రామ రెవెన్యూ పొలంలో 400 చీనీ చెట్లను నాటాడు. ఇందులో ఏడాది వయస్సున్న 300 చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. గురువారం ఉదయం రైతు తన భార్య గంగాదేవితో కలిసి పొలానికి రైతు వెళ్లి చూడగా చెట్లన్నీ నేలవాలి కన్పించాయి. వాటిని చూసి రైతులు కన్నీటి పర్యవంతం అయ్యారు. కాగ ఈ పరిసర గ్రామాల్లో 15 సంవత్సరాల క్రితం ఫ్యాక్షన్ గొడవలు ఉండేవి. అప్పట్లో ఇలా చెట్లను నరికివేసిన కొన్ని ఘటనలు చోటు చేసుకున్నాయి. దశాబ్ధకాలంగా అలాంటివి లేకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. మళ్లీ ఆ విషసంస్కృతి మొదలవ్వడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతుకు ఎవరితోనూ ఎలాంటి గొడవలూ లేవని అలాంటి వ్యక్తి చెట్లు నరికివేయడం బాధాకరం అని గ్రామస్తులు చెప్పారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి, మళ్లీ ఇలాంటివి చోటు చేసుకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు కోరారు. ఘటనా స్థలాన్ని సిఐ రామకష్ణ, ఎస్ఐ రామకష్ణారెడ్డిలు పరిశీలించారు. బాధిత రైతుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేలకొరిగిన చీనీచెట్లు

నరికివేతకు గురైన చెట్లను చూపుతున్న బాధిత రైతు

వేర్వేరుగా జెసి ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్ రెడ్డిల పరామర్శ

మొలకతాళ్ల గ్రామంలో చెట్ల నరికివేత విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిలు వేర్వేరుగా గ్రామంలో పర్యటించారు. పొలం వద్దకెళ్లి బాధిత రైతు బాలవర్ధిరాజుతో మాట్లాడారు. చెట్లు నరికివేత సంస్కృతి మంచిది కాదని, దీనికి కారుకులైన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షపడేలా చూస్తామని హర్షవర్ధన్‌రెడ్డి బాధిత రైతులకు తెలియజేశారు.

వైసిపి పాలనలో అన్నీ భారాలే : టిడిపి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలపై భారాలు మోపి నడ్డి విరుస్తున్నారని టిడిపి రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, దేవర్ల మురళి, జిల్లా నాయకులు సరిపూటి రమణ తదితరులు అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో గురువారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రాజీవ్‌కాలనీ పంచాయతీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విధానాలు తెలియజేస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజీవ్‌కాలనీ క్లస్టరు ఇన్‌ఛార్జి నాగరాజు, నబీరసూల్, నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయరు సాకే గంపన్న, జిల్లా నాయకులు నారాయణస్వామి యాదవ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, శివబాల, తేజస్వీణి, దాసరి శ్రీధర్, గుర్రం నాగభూషణం, కూచి హరి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక ఎల్‌బినగర్ నందు టిడిపి నాయకుడు ధనుంజయ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక సామాన్యుడికి బతుకు భారంగా మారిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను భ్రష్టు పట్టించాన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బంగాళాఖాతంలో ముంచిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో ముద్దులు పెట్టి అవ్వా తాతలను సైతం మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కష్టాలు పోవాలంటే మళ్లీ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల మోహన, వెంకటేశ్వర, గోరంట్ల వెంకటేశులు, కూలీలు పాల్గొన్నారు.

గెలుపు కోసం వెతుకులాట

◆ పాత'కాపు'ల్లో ఎవరు మేలంటూ అన్వేషణ
◆ నిఘా, సర్వే సంస్థల ద్వారా ఆరా

సార్వత్రిక ఎన్నికలకు ఇక ఏడాది మాత్రమే గడువు ఉంది. ముందస్తు వస్తే మరింత ముందుగా ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలు పెట్టాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ఏ నియోజకవర్గంలో ఎవరికి పట్టుంది. ఎవరైతే బెస్ట్ అవుతారన్న దానిపై ఆయా పార్టీలు సీరియస్‌గా దృష్టి సారించాయి.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉండగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గెలుపు అభ్యర్థుల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అన్వేషణ మొదలైంది. ఇప్పటికే అధికార వైసిపి వివిధ సర్వేల ద్వారా గెలిచే అభ్యర్థులను గుర్తించే పనిలో పడింది. అటు నిఘా వర్గాల ద్వారానూ, ఇటు సర్వే సంస్థల ద్వారానూ వెతుకులాట ప్రారంభించింది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించే పని చేపట్టింది. ఇందులో పాత కాపులెవరైనా మంచివారుగా ఉండి, వారి వారసులెవరైనా ఉన్నారా అనే అన్వేషణ మొదలు పెడుతున్నారు. పాత నాయకుల్లో మంచి పేరున్న వారు ఉంటే వారిని తెరపైకి తీసుకొస్తే ఎలాగుంటుందన్న పరిశీలనను అధికార వైసిపి చేస్తుండటం గమనార్హం. ఈ మేరకు అనంతపురం నగరంలో ఎన్.రామకృష్ణ, డి.నారాయణస్వామిల పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వారి వారసుల కోసం అన్వేషణ సాగుతుండటం చర్చనీయాంశమైంది. ఇక సర్వే సంస్థలు సైతం ఆయా నియోజకవర్గాల్లో పట్టున్న వారిని పట్టుకునే పనిలో ఉన్నారు. ప్రతిపక్ష టిడిపి కూడా నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల మార్పులు చేస్తామన్న సంకేతాలను ఇస్తోంది. కటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశమిస్తారన్న ప్రచారమూ సాగుతోంది. టిడిపి కూడా అవసరమైతే ఇతర పార్టీల్లోనున్న సీనియర్ నాయకులను తీసుకురావడంగానీ, వారి కుటుంబ సభ్యులను తీసుకురావడంగానీ చేయాలన్న ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. గతంలో కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉంటున్న వారు కొంత మంది స్తబ్దుగా ఉన్నారు. వారిని వచ్చే ఎన్నికల బరిలో నిలిపితే ఎలాగుంటుందన్న యోచన సాగుతోంది. ఈ శాలన్నింటిపైనా సర్వేలు సైతం చేయిస్తున్నారు. ఇలా ఎవరి ప్రయత్నాల్లో వారు తలమునకలై ఉన్నారు.

సమీక్షలు మొదలు

అభ్యర్థుల ఎంపికకు సంబంధించి నియోజకవర్గాల వారీగా సమీక్షలకు సైతం రెండు పార్టీలూ సిద్ధం అయ్యాయి. వైసిపి రాయలసీమ పార్టీ కన్వీనర్‌గానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుసగా కార్యక్రమాలను జిల్లాలో చేపడుతున్నారు. ఇందులో పార్టీ పరిస్థితులను అంచనావేసి శ్రేణులను సన్నద్ధం చేసే పనిలో ఉన్నారు. టిడిపి ఇదేమి ఖర్మ పేరుతో ప్రజల్లోకి వెలుతోంది. పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటన కూడా ఉండే అవకాశముంది. ఈ సమయంలోనే పార్టీ పరిస్థితిని సమీక్షించే అవకాశాలూ ఉన్నాయి. ఏదిఏమైనా జిల్లాలో ఇప్పుడు రాజకీయ వేడి క్రమక్రమంగా పెరుగుతోంది. నాయకులు వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల తోడ్పాటుతోనే జెఎన్‌టియు అభివృద్ధి

ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థుల తోడ్పాటుతోనే కళాశాల అభివృద్ధి చెందుతుందని జెఎన్‌టియు విసి ఆచార్య రంగజనార్ధన అన్నారు. అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సొసైటీ కార్యాలయాన్ని ఉపకులపతి ఆచార్య జి. రంగజనార్ధన గురువారం ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల సౌలభ్యం కోసం కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదిగారని, ప్రతి విషయంలో కళాశాలకు తోడ్పడుతున్నారని కొనియాడారు. కళాశాల పూర్వ విద్యార్థి మాజీ యూపీఎస్సీ మెంబర్ ఆచార్య వై.వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ జెఎన్‌టియు కళాశాల వల్లనే ఎన్నో ఉన్నత పదవులు సాధించగలిగామని చెప్పారు. కళాశాలలో పూర్వ విద్యార్థులకు కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఉపకులపతి, రెక్టార్, ప్రిన్సిపాల్‌ను అభినందించారు. అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థులు అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆచార్య పి.సుజాత, ఆచార్య వి.శంకర్, ఉపాధ్యక్షులుగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్, కార్యదర్శిగా రఘునాథరెడ్డి, జాయింట్ సెక్రటరీగా, ఆచార్య సి.శోభాబిందు ట్రెజరర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆచార్య సాయిబాబారెడ్డి, ఆచార్య వి.శంకర్, శంకర్ రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భవాని, విభాగాధిపతులు, ఆచార్య సి.శోభ బిందు, డాక్టర్ జితేంద్ర గౌడ్, అధ్యాపకులు, వర్శిటీ పీఆర్వో డాక్టర్ రామశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ మెరుగునకు చర్యలు

అనంతపురం జెఎన్‌టియు జాతీయ ర్యాంకింగ్‌ను మెరుగు పరిచేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని ఉపకులపతి రంగజనార్ధన పేర్కొన్నారు. గురువారం స్థానిక వర్శిటీ పరిపాలన భవనంలో ఉపకులపతి అధ్యక్షతన జాతీయ ర్యాంకింగ్‌పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ర్యాంకింగ్స్ దరఖాస్తులో మొత్తం ఐదు ప్రమాణాలు ఉంటాయన్నారు. వీటి కింద ఉప ప్రమాణాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు చాలా జర్నల్స్‌ను ప్రచురించారని, వాటిని సరైనా పద్ధతిలో ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. సమాచార సేకరణకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాకింగ్స్ 100లోపు సాధిస్తే అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. ప్రతి సమాచారాన్ని దరఖాస్తులో పొందుపరిచేలా కషి చెయాలని సూచించారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాకింగ్స్‌లో మంచి ర్యాంకు వచ్చే విధంగా ప్రతి అధ్యాపకుడు కషి చెయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ఎన్.దేవన్న , డిఏపి వి.సుమలత, ఐక్యూఎసి డైరెక్టర్ జివి.సుబ్బా రెడ్డి, ప్రిన్సిపాల్ పి.సుజాత, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విసి రంగజనార్ధన

10న ఉరవకొండలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో ఈ నెల 10వ తేదీ శనివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెద్దిరెడ్డి పర్యటన నేపథ్యంలో అందుబాటులో ఉన్న వైసిపి నియోజకవర్గ నాయకులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ పట్టణ శివారులో రాయంపల్లి రస్తా పక్కన ఉన్న సత్యం కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కళ్యాణదుర్గం : జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దారెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్నారని ఉష శ్రీచరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి మంత్రి పెద్దారెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. ఈ నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు రేవంత్ గ్యాస్ట్రో లివర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంత నగరం లోని సూర్యనగర్ 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన రేవంత్ గ్యాస్ట్రో లివర్ హాస్పిటల్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ సి.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధునాతన సౌకర్యాలతో నూతన ఆసుపత్రిని ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రి నందు ఎండోస్కోపీ, కొలనోస్కోపి, ఈఆర్సీపీ, కడుపులో నొప్పి, గ్యాస్ ట్రబుల్, తేపులు, పొట్ట ఉబ్బరం, వికారం, వాంతులు, ఆహారం అరుగుదల సమస్యలు, మలబద్ధకం కామెర్లు, రక్త వాంతులు, పాన్‌క్రియాటైటిస్, లివర్ సిరోసిస్, హైపటైటిస్ బి, సి, మద్యం వల్ల వచ్చే లివర్ సమస్యలు, జీర్ణకోశ క్యాన్సర్లు తదితర సమస్యలకు తమ ఆసుపత్రి నందు ఆధునిక పద్ధతులలో చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవానికి పలువురు రాజకీయ నాయకులు అధికారులు, పుర ప్రముఖులు హాజరవుతున్నారని తెలియజేశారు.

ఎండీ డాక్టర్ రేవంత్‌రెడ్డి

మార్క్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సాయినగర్‌లోని మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ 50 ఏళ్ల పురుషుడు ఉదయం వేరొక చోట నడుము వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అతను అదే రోజు రాత్రి 8.30 గంటలకు తీవ్రమైన రెట్రోస్టెర్నల్ ఛాతీ నొప్పితో తమను సంప్రదించినట్లు డాక్టర్లు తెలిపారు. ఇసిజి తీయగా తీవ్రమైన ఐడబ్ల్యుఎంఐని చూపింది. ఆపరేషన్ తర్వాత థ్రాంబోలిసిస్ విరుద్ధంగా ఉన్నందున ప్రాథమిక పిఐసి చికిత్సకు ఎంపిక చేసి వైద్యం అందించారు. తీవ్రమైన ఆంజినా, వెన్నునొప్పితో అతను పడుకోలేకపోయాడు. ప్రాథమిక పిసిఐ నుండి ఎల్‌సిఎక్స్ వరకు (స్టెంటింగ్) పూర్తయింది. పిటి స్థిరమైన స్థితిలో 48 గంటలలో డిశ్చార్జ్ అయ్యారు. డాక్టర్లు మాట్లాడుతూ.. తాము మార్క్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏదైనా కార్డియాక్ ప్రొసీజర్ చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంట్లో క్రిటికల్ కేర్ టీమ్‌ని కలిగి ఉన్నామన్నారు. ఏదైనా సంక్లిష్టమైన పరిస్థితిని నిర్వహించడానికి తమ బృందం 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితి ఏదైనా తలెత్తితే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలు చేయడంలో ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆడియో తొరాసిస్ సర్జన్ యోగి చౌదరి, ఇంటెన్సీవిస్ట్ డాక్టర్ స్వర్ణలత పాల్గొన్నారని వెల్లడించారు.

మరణించి మరో ముగ్గురిలో జీవించాడు

కిడ్నీ, లివర్ దానం

వాయు, రోడ్డు మార్గాల్లో అవయవాల తరలింపు

ప్రజాశక్తి-అనంతపురం

తాను మరణించి అవయవ దానం ద్వారా మరో ముగ్గురిలో జీవించాడు ఓ రైతు. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం జిల్లా పాల్యం గ్రామానికి చెందిన నారాయణ స్వామి (59) సోమవారం రోజున రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వెంటనే అతన్ని చికిత్స కోసం కిమ్స్ సవీర ఆస్పత్రికి తరలించారు. అతన్ని రక్షించడానికి మూడు రోజుల పాటు వైద్యులు శ్రమించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆయన బ్రెయిన్ డెడ్ అయ్యారు. కిమ్స్ సవీరలోని అవయవదాన సమన్వయ కర్తలు, మృతుని కుటుంబ సభ్యులకు, బంధువులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో కిడ్నీలు, లివర్ దానం చేశారు. చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానెల్ ద్వారా అవసరం ఉన్నచోటికి లివర్, కిడ్నీలను తరలించారని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతపురం నుండి బెంగుళూరు వరకు రోడ్డు మార్గన వెళ్లి అక్కడి నుండి వాయు మార్గంలో వైజాగ్‌కి అవయవాన్ని తరలించారు. రోడ్డు మార్గంలో నెల్లూరుకి మరో అవయవాన్ని తరలించారు. అవయవాల తరలింపులో గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిన అనంతపురం, కర్నాటక పోలీసులకు జీవన్ దాన్ అభినందనలు తెలియజేసింది.

గ్రాండ్ ఫినాలే విజేత ఆసిఫ్‌కు సత్కారం

విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రాయదుర్గం

జెమిని టీవీ ఇటీవల నిర్వహించిన డాన్స్ ఐకాన్ గ్రాండ్ ఫినాలే పోటీలలో విజేతగా నిలిచిన ఎస్.అసిఫ్‌ను రాయదుర్గం పట్టణంలోని సెయింట్ పాల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం గురువారం ఘనంగా సత్కరించింది. పట్టణానికి చెందిన అసిఫ్ సెయింట్ పాల్ పాఠశాల పూర్వ విద్యార్థి కాగా జెమిని డాన్స్ ఐకాన్ గ్రాండ్ ఫినాలేలో విజేతగా రూ.20 లక్షలు నగదు బహుమతిని సాధించాడు. తమ పాఠశాల పూర్వ విద్యార్థి జాతీయ స్థాయిలో జరిగిన డ్యాన్స్ పోటీలలో విజేతగా నిలిచి ట్రోఫీ, నగదు బహుమతిని సాధించడంతో ప్రధానోపాధ్యాయులు బి.సుగుణజ్యోతి, యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటుచేశారు. ఆసిఫ్‌కు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. పట్టుదల, కృషి ఉంటే జీవితంలో ఉన్నత స్థాయిని చేరుకొవచ్చు అనేందుకు అసిఫ్ ఉదాహరణ అని పాఠశాల యాజమాన్యం ప్రశంసించింది. ఆసిఫ్ అనేక మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటారని అభినందించింది. ఈ అభినందన సభలో ఆసిఫ్ తన డాన్స్ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి

ఎంపీడీవో తేజోత్స్న

బికెఎస్‌లో మాట్లాడుతున్న ఎంపిడిఒ తేజోత్స్న

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అధికారులు సమన్వయంతో ఉన్నప్పుడే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో తేజోత్స్న అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, అంగన్వాడీలు, గ్రామ రెవెన్యూ విద్యా సహాయకులకు ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి తయారీ ప్రణాళికలు, గ్రామసభ, మండల అభివృద్ధి ప్రణాళిక, సచివాలయాలు, అందులోని వివిధ శాఖల సామర్థ్యం పెంపుదల శిక్షణ, సుస్థిరాఅభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ, జిపిడిపి అనుసంధానం, గ్రామ పేదరిక తగ్గింపు ప్రణాళిక తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, జడ్పీటీసీ నీలం భాస్కర్, వైస్ ఎంపిపిలు పగడాల రాంగోపాల్, సాకే జయలక్ష్మి, సర్పంచి పార్వతి ఈవోఆర్డీ దామోదరమ్మ, ఏవో శ్రీవాణి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యోగానంద రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ పై మండల స్థాయి అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, ఏపీవో చెన్నకేశవులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం నందు మండల అధికారులు, సర్పంచులు, ప్రాదేశిక సభ్యులకు ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. తహశీల్దారు బాలకిషన్, ఎంపిడిఒ వెంకట నాయుడు, జెడ్‌పిటిసి ప్రభావతమ్మ, వైస్ ఎంపిపి వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై విచారణ జరపాలని ధర్నా

ఆందోళన కారులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్లో ఫుడ్ పాయిజన్‌పై విచారణ జరిపి అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో టిడిపి నాయకులు ఆదినారాయణ, సిపిఐ నాయకులు మధు యాదవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ల సుదర్శన్, భారతీయ భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షులు తరిమెల జై భీమ్ రామాంజనేయులు, బెస్త సాధికార కమిటీ పార్లమెంట్ అధ్యక్షులు అమర్నాథ్, వాణిజ్య విభాగం కార్యదర్శి డేరంగుల శంకరయ్య, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ గౌస్ పాల్గొని ప్రసంగించారు. ఈనెల 1వ తేదీన కేజీబీవీ స్కూల్లో పాలు కాంచి తోడు వేయకుండా నిర్లక్ష్యం వహించినట్లు తెలిసిందన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం పిల్లలకు భోజన సమయంలో తోడువేయని పాలు పోశారన్నారు. ఆస్పత్రిలో విద్యార్థులు అవస్థలు పడుతుంటే అకౌంటెంట్ సెలవుపెట్టి వెళ్లిపోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. క్లర్కుపై చర్యలు తీసుకోకుండా వదిలిపెట్టడం సరికాదన్నారు. కేజీబీవీలో అంతర్గత కుమ్ములాటల వల్ల పిల్లలను బలిచేస్తున్నారని వాపోయారు. దీనిపై విచారణ జరిపి ఫుడ్ పాయిజన్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మసూద్ వలి, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఏమి కర్మ ఈ రాష్ట్రానికి'

పుట్లూరు : పుట్లూరు మండలం కందిగోపుల గ్రామంలో మండల క్లస్టర్ కొర్డినేటర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రసాభాసగా గ్రామ పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశం రసాభాసగా సాగింది. రెండు ప్రధాన అంశాలు ఆమోదం పొందకుండానే పంచాయతీ సమావేశం ముగిసింది. సమావేశంలో రెండు అంశాలను చర్చించి ఆమోదించడానికి సర్పంచి మీనుగ లలితమ్మ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా 2006 సంవత్సరంలో గ్రామ పంచాయతీకి చెందిన సర్వే నెంబర్ 560/ఎ 2 ఎల్‌పి నెంబర్ 5/2004లో 40 సెంట్లు స్థలాన్ని ఉరవకొండ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి ఇచ్చారు. పంచాయతీ స్థలాన్ని కేటాయించి 16 సంవత్సరాలు కావస్తున్నా అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రస్తుత పాలకవర్గం ఆ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. దీనిపై సొసైటీ యాజమాన్యం హైకోర్టుని ఆశ్రయించింది. 40 సెంట్లు స్థలాన్ని రెన్యువల్ చేసి సొసైటీకి ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై సమావేశంలో కార్యదర్శి చర్చించగా సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని ఆమోదించకుండా వాయిదా వేశారు. మరో అంశమైన పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఐమాక్స్ లైట్లు, విద్యుత్తు పరికరాల కొనుగోలుకు సంబంధించిన టెండర్లను ఆమోదించేందుకు తీర్మానం ప్రవేశ పెట్టారు. కొదరు సభ్యులు ఎలాంటి ప్రచారం లేకుండానే టెండర్లను ఆహ్వానించారని వాటిని రద్దు చేయాలని, మరి కొందరు సభ్యులు తక్కువ ధరకు టెండర్లు వేసిన వారికే కేటాయించాలని తెలిపారు. దీంతో సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ అంశంపై తర్వాత చర్చించి ఆమోదిస్తామని కార్యదర్శి సభ్యులకు తెలియజేశారు. రెండు ప్రధాన అంశాలు చర్చించడానికి ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఒక అంశం కూడా ఆమోదించకుండానే సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి వన్నప్ప, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ట్రైనీ కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండలంలో ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తొలుత మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఏపీడీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నర్సరీ మొక్కలను, ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్, హైడెన్సిటీ ప్లాంటేషన్, రైన్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. మధ్యాహ్నం మల్లాపురం గ్రామ సచివాలయం నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం చూశారు. తడి చెత్త, పొడి చెత్త ద్వారా తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్ నిర్వహణ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొండయ్య, తహశీల్దార్ మారుతి, విస్తరణాధికారి రఘురాంరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్రవాహనాల పెట్రోల్ పైపులను కత్తిరించిన దుండగులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ పట్టణంలో అయ్యప్ప స్వామి భక్తులకు చెందిన ద్విచక్రవాహనాలకు సంబంధించిన పెట్రోల్ సరఫరా చేసే పైపులను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించారు. దీంతో పెట్రోల్ మొత్తం నేల పాలయ్యింది. బుధవారం రాత్రి అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేస్తుండగా దేవాలయం బయట పార్కింగ్ చేసిన దాదాపు 20 ద్విచక్రవాహనాల పెట్రోల్ పైపులను కత్తిరించారు. ఈ సంఘటనపై గురువారం ఉదయం అయ్యప్ప స్వామి భక్తులు ఉరవకొండ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పెట్రోల్ పైపులను కత్తిరించిన దుండగులను గుర్తించి శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పట్టిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి గురువారం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. భగత్‌సింగ్ కాలనీ, బిసి కాలనీల్లో సిసిరోడ్లు, ఇంటింటికీ కొళాయిలు వేయాలని, రైతులకు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, రైతు సంఘం మండల నాయకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

'టెక్ 2కె-22'లో విద్యార్థుల హవా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రూరల్ పరిధిలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 2 కే-22 పోటీలలో పలు కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించారు. గురువారం టెక్ 2 కే-22 పోటీలు నిర్వహించారు. క్విజ్, పేపర్ ప్రెజెంటేషన్ రెండు విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని పలు కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పేపరు ప్రెజెంటేషన్ పోటీలో అనంతపురానికి చెందిన పివికెకె ఐటి కళాశాలకు చెందిన విద్యార్థులు ఎస్.గౌసియా భాను, జి.అమృత ప్రథమ బహుమతి పొందారు. టెక్ కళాశాల ఛైర్మన్ రమేష్ రెడ్డి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

కర్నూలు జిల్లా ఆత్మకూరులో ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో అండర్ 18 బాలికల జిల్లా జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి గెలుపే లక్ష్యంగా పెట్టుకుని జాతీయ స్థాయికి ఎదగాలని ఉరవకొండ మండలం మోపిడి ప్రభుత్వ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జిల్లా జట్టును గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఖోఖో జిల్లా కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, అధ్యక్షులు పుల్లారెడ్డి సలహాలు, సూచనల మేరకు పది రోజులుగా మోపిడి గ్రామంలోని సంజప్ప తాత దేవాలయం మైదానంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బాలికలకు పది రోజులపాటు శిక్షణ ఇవ్వడానికి గ్రామ పెద్దల సహాయ సహకారాలు మరువలేనివన్నారు. శిక్షణ కాలంలో గ్రామపెద్ద జగన్నాథ్, జ్యోతి దంపతులు క్రీడాకారులకు భోజన ఏర్పాటు చేశారన్నారు. క్రీడా మైదానం ఇవ్వడానికి కూడా దేవాలయ కమిటీ పెద్దలు ధనుంజయ, రాజ్‌కుమార్ సహాయం చేశారని రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే బాలికల జట్టుకు గ్రామ సర్పంచి సిద్ధప్ప ఆర్థిక సహాయ సహకారాలు అందించారన్నారు. వీరితోపాటు స్కూల్ ఛైర్మన్ సతీష్, ఉప సర్పంచ్ లీలప్ప, సంజయ్ కూడా వారి వంతు సహాయ సహకారాలను అందించారని తెలిపారు. శిక్షణ కాలంలో ఏర్పాట్లు చేసిన గ్రామ పెద్దలను జిల్లా క్రీడాకారులు సన్మానించారు.

కళ్ల అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల బెంగళూరు శంకర నేత్రాలయంలో కళ్ల ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్ల అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 400 మందికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వ్యాధులకు కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, సర్పంచి వరలక్ష్మి, పంపనూరు సర్పంచి ఎర్రిస్వామి, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పోతన్న, బుసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మడుగుపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొంటారని ఎంపీపీ రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కన్వీనర్, జెడ్‌పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్జే ప్రకాష్ మాదిగ నాయకత్వంలో విజయవాడ తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఈనెల 12వ తేది జరిగే రాష్ట్ర ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సమితి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రాయదుర్గం పట్టణంలో సమితి నాయకులు చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బీటీపీ గోవిందు, రాయదుర్గం తాలూకా అధ్యక్షులు రాజు, వన్నూరు స్వామి, మారెన్న, మల్లేసి, కొల్లప్ప, శివన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పథకంపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతపురం డివిజనల్ పంచాయతీ అధికారి సుమన పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ 120 సంవత్సరాల తర్వాత చేపట్టిన ఈ భూ సర్వే కార్యక్రమం గ్రామాల్లో పలు భూ సమస్యలు, ఇళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడుతుందన్నారు. సిబ్బంది అంకితభావంతో కార్యక్రమాన్ని పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం గ్రామ సభ నిర్వహించడం మొదులుకుని హక్కుదారులకు పత్రాలు ఇవ్వడం వరకు వివిధ దశల గురించి వివరించారు. తహశీల్దార్ నారాయణస్వామి పథకం యొక్క ప్రాధాన్యతను వివిధ దశల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను గురించి తెలియజేశారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయగలమన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ లక్ష్మీనరసింహా, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VII[Th] ADDL-DISTRICT JUDGE, FAMILY COURT, ANANTHAPURAMU
I.A.No:552/2022 in O.S No.67/2017
Between:
Pujari Marekka and others ...**Petitioners/Plaintiffs**
And
T.Anjanamma and others ...**Respondents/Defendents**
Notice To Respondent No:15
R15: T.Pradeep S/ot.Thippeswamy, Residing at D.No:7-148, Boya Street, Siddappa vanka Veedhi, Kalyanadurgam Town, Ananthapuramu Dist.
పై నెంబరు పిటీషన్‌లో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 20-12-2022వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వు మేరకు)
G.YERRISWAMY,
Advocate Kalyanadurgam, Cell:9000333589

IN THE COURT OF THE VII[Th] ADDL-DISTRICT JUDGE, FAMILY COURT, ANANTHAPURAMU
I.A.No:551/2022 in O.S No.67/2017
Between:
Pujari Marekka and others ...**Petitioners/Plaintiffs**
And
T.Anjanamma and others ...**Respondents/Defendents**
Notice To Respondent No:15
R15: T.Pradeep S/ot.Thippeswamy, Residing at D.No:7-148, Boya Street, Siddappa vanka Veedhi, Kalyanadurgam Town, Ananthapuramu Dist.
పై నెంబరు పిటీషన్‌లో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 20-12-2022వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వు మేరకు)
G.YERRISWAMY,
Advocate Kalyanadurgam, Cell:9000333589

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:GOOTY
E.P.12/2020 In O.S 57/2017
Between:
Oruganti Satyanarayana ...**Decree Holder**
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...**Judgement Debtor**
TO
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad , S/o late P.Venkataramaiah, Hindu, major, aged about 47 years, D.No 5/31/A, Dhabada Veedhi, Pamidi town and Mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D of Junior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the file of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree. You are here by noticed U/O 21 Rule 22 C.P.C to appear in this court in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition on 15/12/2022 at 10:30 A.M in the fore noon and that in default of your appearance on the fore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md.Ismail.M.A.B.L.,
Advocate for Decree holder, Gooty.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:GOOTY
E.P. 11/2020 in O.S 56/2017
Between:
Pagadala Ravindra Babu ...**Decree Holder**
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...**Judgement Debtor**
TO
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad S/o late P.Venkataramaiah, Hindu, major. aged about 47 years, D.No 5/3I/A, Dhabada Veedhi, Pamidi town and mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D of Junior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the File of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree. You are here by noticed U/O 21 Rule C.P.C to appear in this court in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition on 05/01/2023 at 10:30 A.M in the fore noon and that in default of your appearance on the fore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md.Ismail.M.A.B.L.,
Advocate for Decree holder, Gooty.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:GOOTY
E.P. 10/2020 in O.S 55/2017
Between:
Oruganti Satyanarayana ...**Decree Holder**
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...**Judgement Debtor**
TO
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad , S/o late P.Venkataramaiah, Hindu, major, aged about 47 years, D.No 5/31/A, Dhabada Veedhi, Pamidi town and Mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D of Junior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the file of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree. You are here by noticed U/O 21 Rule 22 C.P.C to appear in this court in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition on 04/01/2023 at 10:30 A.M in the fore noon and that in default of your appearance on the fore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md.Ismail.M.A.B.L.,
Advocate for Decree holder, Gooty.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:GOOTY
E.P.09/2020 in O.S.54/2017
Between:
Sripathi Venugopala Achari ...**Decree Holder**
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...**Judgement Debtor**
TO
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad S/o late P.Venkataramaiah, Hindu, major. aged about 47 years, D.No 5/3I/A, Dhabada Veedhi, Pamidi town and mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D of Junior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the file of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree. You are here by noticed U/O 21 Rule 22 C.P.C to appear in this court in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition on 15/12/2022 at 10:30 A.M in the fore noon and that in default of your appearance on the fore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md.Ismail.M.A.B.L.,
Advocate for Decree holder, Gooty.

In the court of the prl.Junior Civil Judge, Ananthapuramu
O.S. No: 58/2021
Between:
Y.S.Sekhar Reddy ...**plaintiff**
and
T.Bavuddin ...**Defendant**
Notice to Defendant.
To,
T.Bavuddin S/o T.Gulam Hussain, D.No:2/220, IIIrd Road, Ananthapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాది హాజరు నిమిత్తము 14-12-2022 వ తేదీకి ఉదయం 10-30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
N.JAGADEESH,
Advocate Ananthapuramu

IN THE COURT OF THE VII[Th] ADDL-DISTRICT JUDGE, FAMILY COURT, ANANTHAPURAMU
I.A.No:553/2022 in O.S No.67/2017
Between:
Pujari Marekka and others ...**Petitioners/Plaintiffs**
And
T.Anjanamma and others ...**Respondents/Defendents**
Notice To Respondent No:15
R15: T.Pradeep S/ot.Thippeswamy, Residing at D.No:7-148, Boya Street, Siddappa vanka Veedhi, Kalyanadurgam Town, Ananthapuramu Dist.
పై నెంబరు పిటీషన్‌లో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 20-12-2022వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వు మేరకు)
G.YERRISWAMY,
Advocate Kalyanadurgam, Cell:9000333589